


నీలమణి, రాజమూర్తిల స్నేహానికి పదినెలల వయస్సు.

ఇంటర్వ్యూలలో ప్రారంభమైన వాళ్ళ స్నేహం – ఉద్యోగం దొరికిం తర్వాత అద్దె ఇంటిలో మరో మెట్టెక్కిందని చెప్పొచ్చు.

ఇద్దరూ నాలుగ్గోడల మధ్య – ఒకే కప్పుక్రింద కలిసే ఉంటున్నా–చేస్తున్న ఉద్యోగాలు ఒక్కటే అయినా – ఇద్దరి దృక్పథాలు, ఆలోచనలు, పరిస్థితులు విభిన్న ధృవాల్లాంటివి.

కారణం – రాజమూర్తి కేవలం ఉద్యోగరీత్యా కన్నవారికి–ఉన్న ఊరికీ దూరమై పోడం. అయినా తన ఆలోచనలెప్పుడూ అనారోగ్యంతో బాధపడుతున్న తల్లివేపు - పెళ్ళికి ఎదిగున్న చెల్లెలివేపు – ఇంకా చదువుకుంటున్న తమ్మునివేపు పరిభ్రమిస్తూ ఉండటమే!

నీలమణి జీవితం ఓ విధంగా వడ్డించిన విస్తరిలాంటిదనే చెప్పాలి. తనకీ అంతో ఇంతో బాధ్యతలన్నవి ఉన్నా – తన సంపాదనతో వాటిని ఎదుర్కోగల

తెలివితేటలు- చాకచక్యం- నేర్పు ఉన్న వాడు-నీలమణి.

నీలమణి మంచి రచయిత. ప్రస్తుత సాహితీరంగంలో మంచి పేరున్న వాడు. తన రచనలద్వారా నెల తిరిగే సరికి మరో జీతం సంపాదించుకుంటున్న 'డిమేండ్' గల రచయిత — నీలమణి, ఆ రోజు ఆఫీసుకి వెళ్ళడానికి బద్ధకించి రాజమూర్తి ఇంట్లోనే ఉండిపోయాడు.

"సార్ ? మణిగారున్నారా?" పోస్ట్ మేన్ అడిగేడు.

"ఎక్కడ్నుంచైనా ఉత్తరంవా ?" రాజమూర్తి.

"కాదండీ ! మనీ ఆర్డర్ !"

"ఎక్కడ్నుంచి ?"

"మద్రాస్ నుంచండి ! ఈ వారం 'సాహితి' పత్రికవాళ్ళు వేసిన కథకి పారితోషికంగా యాభై రూపాయలు వచ్చాయండీ !"

"అలాగ్గా ! అయితే ఓ పని చేయండి. ఇక్కడికి దగ్గరేగా ఆఫీసు. వాడిప్పుడు ఆఫీసులోనే ఉంటాడు - వెళ్ళి కలవండి."

"అలాగేనండీ !"

పోస్ట్‌మేన్ వెళ్ళింతర్వాత - సావకాశంగా వరండాలోని వాలుకుర్చీలో కూర్చుని క్రిందటిరోజు తన కొచ్చిన ఉత్తరాన్ని మళ్ళీ చదువుకోసాగేడు — రాజమూర్తి.

'అన్నయ్యా ! - నేను బాగానే ఉన్నాను అమ్మ ఆరోగ్యంమాత్రం అంత బాగా లేదు. మన శాస్త్రిలు గారికి చూపించాను. ఏవో మందులు - టానిక్కులు వ్రాసిచ్చారు. వెంటనే కొని వాడమన్నారు. తమ్ముడు బాగా చదువుకుంటున్నాడు. వాడి పరీక్ష ఫీజు ఈ వారంలో కట్టాలి అక్కడ నీ ఆరోగ్యం జాగ్రత్త. వస్తున్న పండక్కి ఓ పదిరోజులు సెలవుపెట్టి రమ్మని అమ్మ మరీ మరీ చెప్పింది.

నీ చెల్లెలు-సుశీల.'

నెలాఖరోజులు. ఇంటికి డబ్బెలా పంపించడం ? రవి పరీక్ష ఫీజుకి - అమ్మకి మందులు కొనడానికి కనీసం ఓ యాభై రూపాయలైనా పంపించాలి. ఈ వారం దాటితే వాడి యేడాది చదువు పాడైపోతుంది. డబ్బెలా వస్తుంది ? ఎవరిదగ్గర్నుంచైనా చేబదులు తీసుకోవాలి. ప్చ్ ! లాభంలేదు. తన సీపాటికే తెలిసిన ప్రతి ముఖాన్ని అడిగి చూశాడు. ప్చ్ ! మొండిచేయే ఎదురైంది. నీలమణిని అడిగితే ? అవును. వాణ్ణే అడగాలి. మనీ ఆర్డర్ వచ్చింది కూడా ! వాడు కూడా, 'సారీరా !' అంటాడేంవో ? ...ఇస్తాడేంవో ? అడిగి చూద్దాం. ఆమాత్రం యాభై రూపాయలకి కాదంటాడా?...

సాయంత్రం నీలమణి ఇంటి కొచ్చిం తర్వాత - రాజమూర్తి తనని అడిగేడు కాని — మణి, మూర్తి పరిస్థితిని అర్థం

చేసుకోడానిక్కూడా ప్రయత్నించ కుండా, "సారీ బ్రదర్ ! నా దగ్గరుంటే తప్పకుండా ఇచ్చేవాణ్ణి ! నీకు తెలియందేముంది చెప్పు ! నెలాఖ రోజులు ! వచ్చే వారమైతే ఫర్లేదు గాని - ఈ వారంమాత్రం లాభం లేదురా !" అనేశాడు.

రాజమూర్తి మరేం అన్లేక ఊరు కున్నాడు. మణి పావుగంటలో 'నీట్'గా తయారై వీధిలోకి వెళ్ళిపోబోతూ అన్నాడు : "ఒరే, మూర్తీ ! నీ కీ విషయం తెల్సా? బహుశా నీకు తెల్సుం డదులే ! సాహితి పత్రికవాళ్ళు నవలల పోటీ పెట్టబోతున్నారురా ! ఈసారి ఆ పోటీలో మొదటి బహుమతి నెలా గైనా కొట్టేయాలిరా ! వేశ్యల జీవితాల మీద ఓ మంచి నవల రాయాలను కుంటున్నాను. కథా వస్తువు మంచిదే నంటవా ?"

"వస్తువు మంచిదే ! అయితే ఊహించి వ్రాసేకంటే- వాళ్ళ జీవితాల్ని బాగా 'స్టడీ' చేసి రాస్తే నవల వాస్త వానికి దగ్గరగా వస్తుంది. అప్పుడే నీ నవల పాఠకుల్ని ఆకట్టుకుంటుంది."

"అయితే ఏంజేస్తే బావుంటుంది ? వాళ్ళ జీవితాల గురించి బాగా తెల్సు కునే దెలా ?" స్వగతంలా అన్నాడు మణి.

"దానికేం వుందిరా ? వాళ్ళని కల్సుకుని ఓ పదిరూపాయలు పారేశా వంటే నీక్కావాల్సిన వివరాలు వాళ్ళే చెబ్తారు."

"గుడ్ ఐడియారా ! బాగా వృత్తిలో అనుభవం ఉన్నవాళ్ళని కలిస్తే బావుంటుంది కదూ ?" మణి.

"అవున్రా ? మన ప్రక్కవీధి చివరింట్లో ఈ మధ్యే రాజమండ్రినుంచి వచ్చిన ఒకామె ఉందట. నిన్న మన రామకృష్ణ చెప్పేడు. పైకి 'ఫేమిలీ' మనిషిలా కన్పిస్తున్నా—చాలా కొంపల్ని కూల్చిన రకం అట ! ఆవిణ్ణి కలిస్తే నీక్కావాల్సిన వివరాలు దొరకొచ్చు "

"గుడ్ సజెషన్! ఆవిడ దగ్గర్నుంచే నా వేట ప్రారంభిస్తాను ఈ రాత్రి పది గంటలకి ఆవిణ్ణి కలుస్తాను. వస్తారా !" అంటూ వీధిలోకి వెళ్ళి పోయాడు—మణి.

మణి దగ్గర డబ్బుండి కూడా వెధవ లేదనేశాడే ? బేంక్ బేలెన్స్ కూడా వాడి దగ్గరుంది. యాభై రూపాయలకి అందరిలా నెలాఖరని దాటేశాడు. ఇంకెవర్నడగాలి ? అందరికీ తనలానే నెలాఖరు రోజులు ! ఇంటికి డబ్బెలా పంపించడం ? రవి పరీక్షకి ఈ యేడు కాకుంటే – వచ్చే యేడు వెళ్తాడు. అమ్మ పరిస్థితి ఎంతో ఇదిగా లేకుంటే గాని- సుశీల అలా ఉత్తరం వ్రాయదు. అమ్మకి గుండెపోటు మరీ ఎక్కువై ఉంటుంది. ఇలాంటపుడు కనీసం ఓ యాభై అయినా పంపించకపోతే యెలా?

ఒకవేళ తను డబ్బు పంపించ (లే)క పోతే ? అమ్మ పరిస్థితి అటో-ఇటో ? ...అమ్మో ! ? ... అలా జరగడానికి వీల్లేదు. త నెలాగైనా డబ్బు పంపించాలి, అయితే ఎలా ??...

అలా ఆలోచనల్లో సతమతమవుతూ అప్రయత్నంగా టేబిలుమీదున్న తన 'ఆల్బమ్' పేజీలు తిరగవేస్తున్న రాజమూర్తి చూపులు ఓ పేజీలో నిల్చిపోయాయ్ ! బుర్రలో ఓ మెరుపు మెరిసింది.

* * *

ఆ రాత్రి నీలమణి, మూర్తి చెప్పినట్లు ప్రక్కవీధి చివరింటివేపు ఆ వీధిలో జనం పల్చబడింతర్వాత వెళ్ళాడు. తనెంత రచయితైనా నీలమణి కేవలం కాగితాల పులిమాత్రమే ! వీధిలోకంటే వెళ్ళేడుగాని - ఆ ఇంట్లోకి వెళ్ళడానికి ధైర్యం చాల్లేదు. కారణం- ఇలాంటి వ్యవహారానికి నీలమణి క్రొత్తవాడు కావటం ! ఆ ఇంటిముందు తచ్చాడుతూ ఉంటే - 'ఆమె' మణి పరిస్థితి గ్రహించి- "అక్కడే నిలబడిపోనారేటండీ ? లోనికి రాండి!" అంటూ తన పాకలోకి తీసుకుపోయి - కూర్చోడానికి బి. సీ. నాటి నులకమంచాన్ని చూపించింది. లోపల మిణుకు మిణుకు మంటున్న ఓ గుడ్డిదీపం ఉన్నా ఒకరి ముఖం మరొకరికి సరిగ్గా కన్పించటం లేదు ! 'ఇదీ ఒకందుకు మంచిదేలే' - అనుకుంటూ మంచంమీద కూర్చున్నాడు - మణి. తను కూడా ప్రక్కనే కూర్చుంటూ ఫక్కున నవ్వుతూ జాకెట్టు గుండీలు విప్పసాగిందామె.

"నే వచ్చింది నీ శరీరంకోసం కాదు- ఇలాంటి వెకిలిచేష్ట లేవీ చెయ్యకు !" అన్నాడు మణి.

ఆ సుందరి కొన్ని క్షణాలు తెల్లబోయింది.

"ఇదుగో ఈ అయిదు రూపాయలు తీసుకుని - నే నడిగే ప్రశ్నలకి నీకు తెలిస్తే సమాధానాలు చెప్పు."

"అనాగేనండి !" సంతోషంగా ఆ నోటు బ్రాలో దోపుకుంటూ అంది.

మణి తన జేబులోంచి చిన్న సైజు డైరీ-పెన్ను తీశాడు. తనకు కావాల్సిన విషయాలు ఆమె చెబుతూంటే - కొండంత ఉత్సాహంతో డైరీలో రాసుకోసాగేడు - అతి కష్టంమీద.

అంతవరకూ లేని మూడోవ్యక్తి తామిద్దర్నీ తినేసేటట్లు చూస్తుండటం గమనించిన ఆ సుందరి భయంతో మణి దగ్గరికి జరిగి కూర్చుంది.

"వెధవ్వేషా లెయ్యొద్దని ముందే చెప్పానా, లేదా ?" అంటూ చిరాగ్గా తలెత్తిన మణి ఎదుటివ్యక్తిని చూసి భయంతో కంపించిపోయాడు.

ఎర్రటోపీ-పంగనామాలు-పెద్ద పెద్ద మీసాలు-చేతిలో లాఠీతో ప్రత్యక్షమైన ఆ అవతారం ఓ హెడ్‌కానిస్టేబుల్ దని



గ్రహించిన మణి నోట మాటరాక భయంతో వణికిపోసాగేడు.

"ఏయ్ మిస్టర్ ! చూడ్డానికి మంచి కుటుంబంలోంచి వచ్చినట్లున్నావ్ ! ? ఈ వెధవపని చేయడానికి సిగ్గులేదూ?"

"సార్ ! సార్ ! నే నటువంటి వాణ్ణికాదు సార్ ! నే నసలు ఆ ఉద్దేశంతో ఇక్కడికి రాలేదు సార్ ! నేను రచయితనండీ ! కథకి 'ప్లాట్' కోసం వచ్చానండి !..."

"స్టాపిట్ ! నాన్‌సెన్స్ ! చేసిన వెధవపనికి సమర్థింపు కూడానా ! ? పద ! పద !"

"ఎక్కడికి సార్ ?"

"ఆమాత్రం తెలవదా ? - పోలీస్ స్టేషన్‌కి !"

"సార్! సార్ ! అంత పనిమాత్రం చేయకండి సార్ ! నా జేబులో ఉన్న దంతా ఇచ్చేస్తాను. ఈసారికిమాత్రం నన్ను వదిలేయండి సార్ !"

"........."

"సార్ ! సార్ ! కాస్త దయ చూపించండి సార్ ! నన్ను గనక మీరు స్టేషనుకి తీసుకెళ్తే, నాకున్న పేరంతా పోతుంది సార్ ! ఈసారికి మాత్రం వదిలేయండి సార్ !

మరెప్పుడూ ఈ ఛాయలకి రాను సార్!"

"స్సరే ! ఎంతుందేఁవిటి-జేబులో?"

"లెక్క పెట్టలేదు సార్ ! సుమరో అరవై దాకా ఉంటుందండి ! తీసుకోండి సార్ !"

"స్సరే ! నీవు రచయితవి గనక బ్రతికిపోయావ్ ! ఇకనుంచైనా జాగ్రత్తగా ఉండు."

"థాంక్యూ సార్ ! వస్తాను సార్!"

* * *

మరుసటిరోజు ఉదయం మణి లేస్తూనే స్వగతంలా అనుకున్నాడు :

"రాజమూర్తికి యాభై రూపాయలు అడిగినప్పుడు ఇచ్చినా బాగుండేది ! ఖర్మ ! అలా జరగాలనుంటే అంత మంచి బుద్ధెలా పుడుతుంది ? ప్చ్ఁ ! ప్రాప్తం లేదంతే! ఇలా వచ్చిన యాభై రూపాయలు - అలా ఎగిరిపోయాయ్. డబ్బుపోయినా కాస్తో - కూస్తో వివరాలు సేకరించగలిగాను. నలుగురి దృష్టిలో పడకుండా ఉండగలిగాను. అంతే చాలు ! ... "

మణి మాటలు ప్రక్కనే ఉన్న రాజమూర్తికి విన్పించకపోలేదు.

"ఏఁవిట్రా ? నీలో నీవే గొణుక్కుంటున్నావ్ ? నీకోసం రాత్రి చూసి చూసి నిద్రపోయాను." రాజమూర్తి.

"అబ్బే ! ఏఁవీ లేదురా ! రాత్రి నే నొచ్చేటప్పటికి పది దాటిందిలే ! అప్పటికి నీవు మంచి నిద్రలో ఉన్నావ్ !"

"వెళ్ళిన పని అయిందా ?"

"ఆఁ, అయినట్టే !"

రాజమూర్తి తన టేబులు సొరుగులోని 'ఆల్బమ్' మధ్య పేజీలోని ఫొటో వేపు తదేకంగా చూస్తూ అనుకున్నాడు. మూణ్ణెల్లక్రితం ఓల్డ్ బాయిస్ కాలేజీ డే ఫంక్షన్ నాటకంలో తను వేసిన హెడ్ కానిస్టేబుల్ పాత్రకి బహుమతితోబాటు లభించిన 'యూనీఫాం'కి అర్థఁవూ - పరమార్థఁవూ లేదని అప్పుడు అన్పించినా - రాత్రి మాత్రం అవసరానికి మంచి మిత్రునిలా అ 'యూనీఫాం' ఆదుకుంది."

'నీ మిత్రుని అలా మోసం చేయడం న్యాయంగా లేదు సుమా !' అంతరాత్మ లోపల్నుంచి అరుస్తున్నా- ఇందులో మోసవేఁ వుంది ? పది, పదిహేను రోజుల్లో నా 'ఓవర్ టైం' డబ్బు ఎలానూ వస్తుంది. అప్పుడు అసలు విషయం వాడికి చెప్పి డబ్బిచ్చెయొచ్చు. పైగా ఈ 'హింట్' ఆధారంతో వాడు ఓ మంచి కథ రాయడానికి ఆస్కారం కలిగించొచ్చు కూడా ! అంటూ అంతరాత్మ నోరు నొక్కేశాడు- రాజమూర్తి !

—: o: —